# సంకెళ్ళు తెంచేయండి!

వసుంధర-సుశీల ఆవేళ ప్రొద్దున్నే పట్నం నుంచి వచ్చారు.

" ఆడపిల్లల్ని వంటరిగా ఎలా పంపారే!" అంది మహాలక్ష్మి ఆశ్చర్యంగా.

" ఏమిటి మామయ్యా! అత్తయ్యింకా పాత చింతకాయ కబుర్లు మానలేదు!" అని నవ్వింది వసుంధర.

"అదెప్పుడూ అంతేకదమ్మా! ముందు పట్నం కబుర్లు చెప్పు. అంతా కులాసాగా వున్నారా?" అని అడిగాడు రంగారావు.

" ఆహాఁ!....మా బొచ్చు కుక్కతోసహా అంతా క్షేమం!"

" ఇంకా శలవులిచ్చాక మీరుత్తరం రాస్తారని మీ మామయ్యే వద్దామని అనుకుంటున్నారు." అంది మహాలక్ష్మి.

" ఓసారి మీ వూరు చూడాలనిపించింది. నేనూ సుశీతో బయలుదేరాను... ఈ మాత్రం ప్రయాణానికి మాకు బాడీగార్డులు కూడా ఎందుకు?" అని నవ్వేసింది వసుంధర.

"ఏమ్మా! బాగా చదువుకుంటున్నావా?" అని కూతుర్ని పలకరించాడు రంగారావు.

సుశీల తల వూపింది. చద్దన్నం తింటున్న రమణ, రాధ అంటచేతులతోనే వచ్చి సుశీలని చుట్టు ముట్టేసారు.

వంటింటి గుమ్మంలో అలాగే నిలబడి పోయిన రాజ్యలక్ష్మిని చూసి వసుంధర కళ్ళింత చేసుకొని చూసింది. "....వదినా! నేను నేను వసూని.... మీ బావని కాదు!....అబ్బ మరీ అంత సిగ్గయితే, మీ అన్నయ్య ఆటాడించేస్తాడు సుమా!"


అంతా నవ్వుకున్నారు. సుశీల వాళ్ళక్క దగ్గరకి వెళ్ళింది.

" ఏమ్మా! మా సుశీ పేచీలు పెట్టకుండా ఉంటోందా? మీ అమ్మని నొప్పించటం లేదు కదా!......." అని – కుతూహలంగా అడిగింది మహాలక్ష్మి.

వసుంధర నిండుగా నవ్వింది. ".......నేనే ఇక్కడ ఏవో పేచీలు పెట్టాననుకో! నా మీద మా అమ్మకి, నాన్నకి రిపోర్టు చేస్తావా అత్తయ్యా."

" అదికాదమ్మా! ఇన్నాళ్ళకి దీనికొక్కదానికి చదువబ్బుతోంది కదా అని మీ దగ్గరుంచాము కాని...."

"చదివిస్తే పెద్దాదినా చదివుండేది. చిన్నాదినా



చదివుండెది !....అఁ! అఁ! పల్లెటూరని చదువు కోటానికి వీల్లేక పోయిందనీ – అవేం నాకిప్పుడు చెప్పకు! ఉద్దేశముంటే ఉపాయం దొరక్కపోయేదా ?''

"సరే, గతం గురించి ఎందుగ్గాని మా సుశీల గురించి చెప్పు...."

"ఏం చెప్పను ?....ఒక్కముక్కలో చెప్పాలంటే, సుశీని చూసి బుద్ధి తెచ్చుకోవే అని మా అమ్మ రోజుకి రెండుసార్లయినా నాకు గడ్డి పెడుతోంటుంది–చాలా ?''

అంతా గలగల నవ్వారు. మహాలక్ష్మికి మనస్సు శాంతించింది. రంగారావు ఏదో పనిమీద బయటకు బయలుదేరాడు.

"....మరి మా చిట్టిబావ ఎక్కడున్నాడత్తయ్యా–కనిపించదేం ?'' అంది వసుంధర ఇల్లంతా కలయజూస్తూ.

"వాడా ? తోటకు వెళ్ళాడమ్మా !....మామిడికాయ దింపిస్తున్నారు....మధ్యాహ్నానికి భోజనానికి వస్తాడులే !....అయ్యో ! నా మతి మండ–నిన్ను కబుర్లలో పెట్టి కూర్చున్నాను. కాఫీ అయినా ఇచ్చాను కాదు !'' అంటూ నొచ్చుకుంటూ వంటింటివైపు నడిచింది మహాలక్ష్మి.

వసుంధర కూడా వంటింట జరుగుతున్న 'కాన్ఫరెన్సు'లో పాల్గొనటానికి వెళ్ళింది.

*

"....అబ్బ. ఎప్పుడూలేన్ది ఇంత మొద్దు నిద్ర పోయానేమిటో !'' అంటూ లేచింది వసుంధర.

"ప్రయాణంలో అలిసిపోయుంటావని నేనే లేపనివ్వలేదు....'' అంది మహాలక్ష్మి.

"మరి సుశీ ఏది ?''

"స్నేహితులు ఒక్కొక్కరే వచ్చిపోతున్నారు. దానికింక నిద్రెక్కడ ?''

"మరి చిట్టిబాబు రాలేదూ !''

"వచ్చి భోంచేసి మళ్ళీ తోటకి వెళ్ళాడమ్మా!"

"పోనీ, లేపకపోయావా ?''

"సాయంత్రానికి వచ్చేస్తాడులే !''

"మామయ్య ఏరీ ?''

"ఆయనకా-ఊర్నిండా రాచకార్యాలే !'' అని నవ్వింది మహాలక్ష్మి.

"వదినా !....'' అని ఆమె పిలవటంతో రాజ్యలక్ష్మి వచ్చింది. "లేచావా !'' అంటూ.

రాజ్యలక్ష్మి నవ్వింది. "ఆ ముచ్చట్లకి మొదలే కాని తుది అంటూ ఉండదు !''

వసుంధర కేక పెట్టటంతో సుశీల వచ్చింది.

"ఇంకీపూట మీ కచేరీ ముగించి మా చిన్న కోరికలు తీరుస్తారా రాణీగారూ !''

సుశీల నవ్వుతో అంది. "ఓహో ! ఊరు చూద్దామన్నావుకదూ !''

"అవును. చీకటడకుండా తిరిగొచ్చేద్దాం. త్వరగా తెములు....''

"మనూళ్ళో చూడ్డానికేముందీ ?'' అని నవ్వింది రాజ్యలక్ష్మి.

"అదేం మాట వదినా ! గుండెనిండా పీల్చుకోటానికి స్వచ్ఛమైన గాలి ఉంది-కన్నుల విందు చేయటానికి పచ్చని పొలాలున్నాయి .... ఆ పైన నీలాంటి చక్కని చుక్కలున్నారు....''

"ఇంకాపైన అందాల రాకుమారుడిని– చూసుకోవచ్చు అనుకుంటున్నావేమో ! కొంచెం దివినుండి భువికి దిగమ్మా వసుంధరాదేవీ !.... హీరోలు మావూరి పొలాలమ్మట తిరగరు....'' అంటూ నవ్వింది రాజ్యలక్ష్మి.

"ఏం నీ హీరో పట్నంలో ఉండగాలేంది– నాహీరో పొలాల్లో ఎందుకుండకూడదని.''

రాజ్యలక్ష్మి బుగ్గలు కెంపులయ్యాయి. పారిపోబోతున్న ఆమె చెయ్యి పట్టుకొని,

"ఊఁ! వదలి పెడతాననుకున్నావా !........ నువ్వు కూడా నాతోపాటు బయటకు రావల్సిందే!'' అంది వసుంధర.

మరో పావుగంటలో సుశీల – వసుంధర తయారయి వచ్చారు.

"ఎక్కడికీ బయలుదేరారు?'' అని అడిగింది మహాలక్ష్మి.

వసుంధర చెప్పింది.

"ఇప్పుడు నడిచి వెళ్ళటం ఎందుకమ్మా !.... రేపు మీ మామయ్య బండి కట్టిస్తారు....చక్కగా వెళ్ళి రావచ్చు....''

"ఆ పట్నంలో ఎలాగా వాహనాలు తప్పవు. ఇక్కడయినా కాస్త కాళ్ళ గుబులు వదుల్చుకుందామనుకుంటుంటే బండి అంటావేమిటీ అత్తయ్యా !....''

మహాలక్ష్మికేమనాలో తోచలేదు. దొడ్డి గుమ్మంలో పిలిస్తే అటు వెళ్ళింది.

"అమ్మ పైకి అలా అంది కాని అసలు ఉద్దేశం అది కాదు....మనం బయట తిరక్కూడదని !'' అంది సుశీల రహస్యంగా.

"ఏం ?''

"నీకేం తెలియదు. అంతా అయోమయం ! ఈ పల్లెటూళ్ళో మనలాంటివాళ్ళు బయటకు వెడితే.

"వెడితే ?''

"వింతమృగాల్ని చూసినట్టు చూస్తారు."

"పోనీలే ! అడవి జంతువులకన్న వింత మృగాలు మెరుగే కదా !....నువ్వు కూడా తయారయి రా వదినా !....''

"ఉహుఁ ! నాకు బోలెడంత పని ఉంది....'' అని అక్కడ్నించి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

వసుంధర ముఖం చిన్నబోయింది.

"అక్కకి రావాలనే వుంది వదినా! కాని...."

"........కాని ?''

"చూస్తూనే ఉన్నావుగా అది కట్టుకున్న బట్టలు....'' అంది సుశీల తల దించుకుంటూ.

"అవును. నీకున్న తెలివయినా నాకు లేకపోయింది. ఇదిగో ఇది కట్టుకొని రమ్మను.... లేకపోతే నామీద ఒట్టేనని చెప్పు.'' అని తన సూట్‌కేసులోని చీర తీసి సుశీల చేతుల్లో పెట్టింది వసుంధర.

*

పెద్ద మగాడులా రమణ ముందు దారి తీస్తున్నాడు. సుశీల చెయ్యి పట్టుకుని రాధ చేలగట్లపైన గెంతుతూంది.

"వదినా ! అదేమిటి ? .... ఇదేమిటి ?'' అంటూ అడుగుతూ వెనగ్గా నడుస్తోంది వసుంధర. రాజ్యలక్ష్మి ఓపిగ్గా జవాబులు చెపుతోంది.

"....అబ్బ. అస్తమానం వదినా, వదినా అనకపోతే....చక్కగా పేరుపెట్టి పిలవకూడదా?" అంది రాజ్యలక్ష్మి గోముగా.

ఫక్కున నవ్వింది వసుంధర. "....ఓహో ! అర్థమయిందిలే !....ఉత్తుత్తిగా పిలవటమేనా లేక మీ అన్నయ్య ఆ మాట ఏమన్నా అంటున్నాడా– అని అడుగుతున్నావు కదూ !''

ఆమె బుగ్గలు ముద్ద మందారాలయ్యాయి. చటుక్కున ముఖం ఎటో త్రిప్పుకుంది. ఆమె చెయ్యి పట్టుకుంటూ అంది వసుంధర. "నా మీద కోప్పడకు వదినా !... నేను హంస రాయబారం చేస్తానులే !''

"ఊఁ! ఇంకిలా అన్నావంటే నేన్నితో రాను...."

"అమ్మో! ఈ అరణ్యంలో నన్నొదిలేస్తే హడలి చచ్చిపోనూ!...."

"సరేకాని, నీ పెళ్ళిగురించి మామయ్యా వాళ్ళూ ఏమీ అనుకోవటం లేదూ!"

"....అనుకోకపోవటం ఏమిటీ? ఆరు నెల్ల నుంచి కాపాడుతున్నారు కాని, బియ్యే పూర్తయ్యే దాకా అవేం పనికిరావు – అన్నాను....నీ పెళ్ళికి అడ్డురాదులే!....అన్నయ్య రెడీ! ఇంక పెద్దాళ్ళు అనుకోవడమే ఆలస్యం!"

వసుంధర పరిహాసాన్ని పట్టించుకోలేదు రాజ్యలక్ష్మి...."ఒక్కటడుగుతాను. ఏమీ అనుకోవు కదా!"

"అదేమిటి వదినా! నే నంత పరాయి దాన్నయి పోయానా?"

"ఉహుఁ! నువ్వలా నొచ్చుకుంటే నేను చెప్పలేను."

"సరేబాబూ! నీ మనసులోని మాటేమిటో చెప్పు."

"నీ పెళ్ళికి ఎంతకట్నం ఇచ్చి చేద్దామనుకుంటున్నారు?...."

"భలేవుంది నీ ప్రశ్న. అసలు పెళ్ళి చూపులే లేకుండా...."

"..ఎస్టిమేటు అంటూ ఒకటి వుంటుందికదా!"

"ఏం? మామయ్య అన్నయ్య కెంత ఇద్దామనుకుంటున్నాడేమిటి?" అంది వసుంధర పెంకిగా.

"నీ పెళ్ళిని బట్టేవుంటుంది...." రాజ్యలక్ష్మి గంభీరమైన మాటలకి నిర్ఘాంతబోయింది వసుంధర.

"కొంతయినా ఇలా పుచ్చుకుంటేగా-నీ పెళ్ళికి అలా సర్దుబాటు చేయగలిగేదీ? మీ నాన్న మాత్రం ఎక్కడ్నించి తెస్తాడు?—"

"అబ్బ, ఎంత దూరం ఆలోచిస్తున్నావు వదినా!"

రాజ్యలక్ష్మి నవ్వులో జీవం లేదు.

"ఆ పప్పులేం ఉడకవ్! కట్నాలు పుచ్చుకోవటం నిషిద్ధం. అన్నయ్యకి కట్నం యిస్తే నిన్నూ వాడినీ పోలీసు రిపోర్టు ఇచ్చి జైల్లో పెట్టిస్తాను!"

"పిచ్చివసూ! పుచ్చుకునేవాళ్ళు – ఇచ్చేవాళ్ళు బహిరంగంగా చెయ్యరు .... ఒకవేళ చేసినా స్త్రీ ధనం అనేస్తారు. మనుషుల మనస్సుల్లో మార్పురావాలికాని చట్టాలు గిట్టాలు ఎందుకూ పనికిరావు....బైండు పుస్తకాల్లో చూసుకోవటానికి తప్ప!"

"ఉహుఁ! అన్నయ్య అలాంటివాడు కాదు...."

జాలిగా నవ్వింది రాజ్యలక్ష్మి. "మీ బావ అలాంటివాడు కాదు. అయినా, వాళ్ళ చెల్లెలి పెళ్ళికి డబ్బు అవసరం అయినప్పుడు....నాన్నని అడక్కుండా ఉండలేకపోయాడు. నాన్న ఇవ్వక ఏం చేస్తాడు? ఇదంతా ఒక వలయం!...."

"అలాంటి బాదరబందీ లేని వాడినే చూసి చేసుకుంటాను నేనయితే!...."

"అంటే, తోబుట్టువులు లేని వాడినా?"

వసుంధర ముఖం వెలవెలబోయింది. ఆమెకు ఏమనలో కూడా తోచలేదు.

"నిజం చాలా చేదుగా ఉంటుంది వసూ!.... ఈ సమస్యతో నీ మనస్సిప్పటి నుంచే పాడు చేసినట్టున్నాను."

"అదేం లేదు వదినా!...." అందే కాని వసుంధర ఆలోచించకుండా ఉండలేక పోయింది.

అంతలో మామిడితోటలో అడుగు పెట్టారు వాళ్ళు.

అందరి భోజనాలు అయ్యాయి.

మహాలక్ష్మి ఇంకా ఇల్లు చక్కబెట్టుకోవటం అవలేదు. దొడ్లోకి వెళ్ళిన సుశీల తల్లిని కేక వేసింది. ఐదు నిమిషాల్లో వెనక్కివచ్చిన మహాలక్ష్మి .... "అమ్మా రాజీ!.... మీరంతా ఒక్కసారి లేవండి!...." అంది.

తల్లిమొహం డీలా పడిపోవటం చూసి "ఏమిటమ్మా!" అని అడిగింది ఆత్రుతగా.

"ఏముంది తల్లీ! మరో కుంపటి గుండెల మీదికి ఎక్కింది...." అంటూ కన్నీళ్ళ పర్యంతమై అక్కడినుంచి వెళ్ళిపోయింది మహాలక్ష్మి.

## ఇంతలో ఎంత?

ముల్లును విడిపోవాలని
వింత ప్రపంచాన్ని చూడాలని
బయటకొచ్చింది తెల్లనైన మొగ్గ
పరుగురాని ఆ మొగ్గ,
నల్లని తారురోడ్డుపై పడింది
తక్షణమే దానిపైనుండి
ఓ బస్సుపోయింది!
రేకులురాని ఆ మొగ్గ,
రబ్బరు టైర్ల క్రింద నలిగింది
టైరునెదిరించే శక్తిలేక
అక్కడే వుండిపోయింది
అంతటితో దాని జీవితమే అంతమైంది!

—యం. విశాలాక్షి

## "స్త్రీమూర్తి"

ఆరు నెలల పసిపాపగా
తల్లి ఒడిలో పాలు త్రాగాను....
ఆరేళ్ళ బాలికగా
ముద్దులొలికించాను....
పదహారేళ్ల పడుచుగా
పసిడి కాంతులను వెదజల్లాను....
రెండు–పదహారేళ్ళ వనితగా
తల్లినై మాధుర్యాన్ని పంచి పెట్టాను....
అరవై యేళ్ళ అమ్మమ్మగా
అనురాగం పంచి ఇచ్చాను....
అన్ని వయసులా అన్ని వేళలా
దీపంలా వెలుగులను
పంచి యిచ్చిన నేను....
ఒక సామాన్య స్త్రీ మూర్తిని!

—ఎ. సుధారాణి

మరి కాసేపట్లో ఆవిడ బాధేమిటో తెలిసి వచ్చింది వాళ్ళకి.

"....ఛ! ఈ మాత్రం దానికి అంతమాటం టుందేమిటి అత్తయ్య!....నువ్వు కాలేదా? నేను కాలేదా? ఎప్పుడో అప్పుడు ఆడపిల్లలందరికీ ఆ స్టేజి రావల్సిందేగా!....పాపం, సుశీ ఎంత నొచ్చుకుందో!" అంది వసుంధర.

రాజ్యలక్ష్మి గాఢంగా నిట్టూర్చింది.

ఇంట్లో హడావిడి బయలుదేరింది.

"....ఇప్పుడే రాత్రివేళ తాటాకులూ అవీ తెప్పించాలామ్మా! తెల్లారాక చేయకూడదాయేం?" అంది రాజ్యలక్ష్మి.

రంగారావూ—చిట్టిబాబూ అదే మాటన్నారు. మహాలక్ష్మికి ఇంకేమనాలో తోచలేదు.

సుశీలకి వేరే పక్క వేసారు. సిగ్గుతో తల త్రిప్పుకు పడుకుంది.

లోపలి గదిలో పెద్దవాళ్ళు తర్జన భర్జన పడుతున్నారు.

"ఎందుకంత ఇదవుతుంది అత్తయ్య!...." అంది వసుంధర విసుగ్గా.

"అక్కయ్య పెళ్ళికయిన అప్పు తీరలేదు. కాని, పురిటికి పుట్టింటికే పంపారు వాళ్ళు........ పల్లెటూరు అని అయినా చూడకుండా. పట్నం నుంచి డాక్టర్ని రప్పించి పురుడు పోయాల్సి వచ్చింది. వాళ్ళింకా ఊపిరి తీసుకోలేదు, నేను పెద్దమనిషినయ్యాను. మళ్ళీ అయిదు వందలు అప్పు....పండిన పంటలో సగభాగం ఎప్పుడూ షావుకారు కొట్టుపాలే కదా! .... ఇంతలో అది కూడా....కూర్చుంది...."

"అంటే? ఇప్పుడా హడావిడి అంతా చెయ్యాల్సిందేనా?"

"ఆఁ! అప్పు దొరక్కపోతే అమ్ముకొని అయినా చెయ్యాలి....అదిగో మా అమ్మ మాటలు విను."

లోపల వాళ్ళనుకుంటున్న మాటలు కొద్దో గొప్పో వినిపిస్తున్నాయి.

"ఛ! ఆడపిల్లంటే ఇంత భారమయిందా కన్నవాళ్ళకి!" అంది వసుంధర బాధగా.

"వాళ్ళుమాత్రం ఏంచేస్తారు?....ఈ ఆర్భాటం చేయకపోతే, ఊరు ఊరంతా వాళ్ళనంటారు!.... తెల్లారాక చూడు. తీర్థప్రజల్లా వచ్చిపడతారు. మూడురోజులు కావల్సినంత హడావిడి. నీళ్ళయ్యాక ఊరందరికీ భోజనాలు....వచ్చినవాళ్ళు తిని పోరు. ఏదో ఒక మాటంటారు. నా పెళ్ళి ఇంకా చేయలేదేమంటారు. ఎప్పుడు చేస్తారంటారు? ఇంక చదువు మాన్పించి సుశీని కూడా మొగుడికోసం ఎదురు చూస్తూ కూర్చోమంటారు. అవి పైకి పరిహాసాల్లా కనిపిస్తాయేకాని లేత మనసుల్ని గాయం చేస్తున్నాయని ఒక్కళ్ళకీ తట్టదు.... సంప్రదాయాల పేరున మనమిలా కుమిలిపోవల్సిందే!...ఈ అనేవాళ్ళంతా ఎవరనుకుంటున్నావు? ఆడవాళ్ళే! ఒకప్పుడు అంతా యీ బాధలన్నీ అనుభవించిన వాళ్ళే! ప్చ్! కాలం ఎంతమారినా మనుషులింకా మారలేదు...."

రాజ్యలక్ష్మి వైపు కన్నార్పకుండా చూసింది వసుంధర.

"పెద్దచదువులు చదవనిది ఇన్ని పెద్దమాటలు మాట్లాడుతోందేమిటనుకుంటున్నావా?"

వసుంధర నిండుగా నవ్వింది. "లేదు వదినా! పెద్దపెద్ద కాలేజీ చదువులు చదువుతున్నాం — అని చెప్పుకోవటమేకాని జీవితం గురించి ఆలోచించటం మాకేం తెల్సిందని?....ఇంతకాలం నిన్నెంతో అండర్ ఎస్టిమేట్ చేసాను. నన్ను క్షమించు వదినా!"

రాజ్యలక్ష్మి నవ్వింది. "ఏమిటో నీ పిచ్చి!...."

"ఇప్పుడేం చేయాలంటావు? మనం చేయగల్గిందేం లేదా?"

ఆమె వైపు సూటిగా చూసింది రాజ్యలక్ష్మి. "ఉంది....కట్నం పుచ్చుకోనివాడినే చేసుకుంటానన్నావు. ఆ సంగతటుంచు....చిన్నపని చెప్తాను. చేయగలవా?"

వసుంధర తల పంకించింది. కంగారుగా తల త్రిప్పి వాళ్ళవైపు చూసింది సుశీల.

ఆ గది తలుపులు దగ్గరగా వేసి వచ్చింది రాజ్యలక్ష్మి. ఇద్దరూ సుశీల దగ్గరికి చేరారు.

*

తెల్లవారి లేచిన మహాలక్ష్మికి పక్క మీద కనిపించలేదు సుశీల....పరకాయించి చూస్తే ఇటు వైపు వసుంధర కూడా కనిపించలేదు.

ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్న రాజ్యలక్ష్మిని లేపి "వాళ్ళేమయ్యారే!...." అని అడిగింది.

తను కూడా ఇల్లంతా వెదికి వచ్చి "వసూ తెచ్చుకున్న సూటుకేసు కూడా కనిపించటం లేదు." అంది రాజ్యలక్ష్మి.

"ఇదేం సోద్యమే తల్లీ! నే నింత కంగారు పడి చస్తుంటే అంత తాపీగా చెపుతున్నావు!" అంటూ పొలో పొలోమని భర్తని లేపింది.

అతని నిద్రమత్తు వదిలే లోపలే "ఇదిగో దొరికింది" అంటూ ఓ కవరు పట్టుకు వచ్చి ఇచ్చింది రాజ్యలక్ష్మి. గబగబా కవరులోంచి కాగితం తీసి కంగారుగా చదవసాగాడు రంగారావు.

అత్తయ్యకి - మామయ్యకి -

నమస్కారములు.

కంగారు పడకండి. సుశీని తీసుకొని నేను పట్నం వెళ్ళిపోతున్నాను.

అది పెద్దమనిషి అయినట్లు మీరూళ్ళో ఎవరితోనూ చెప్పుకోవద్దు. ఏవన్నా జరిపించాల్సినవి వుంటే అమ్మతో చెప్పి నే నిక్కడ చేయిస్తాను.... అమ్మ తిడితే అవన్నీ నేనే పడతాను. మీరు బాధ పడకండి!

మీ మీద ఏదో తప్పుందని అమ్మకి సంజాయిషీ ఇచ్చుకుందామని మీరు శ్రమపడి రావద్దు!

మీ మీదున్న తప్పు మీదికాదు....మీ చుట్టూ ఉన్న సంఘానిది! స్తోమతు ఉన్నరోజుల్లో సరదాలంటూ ఆడంబరాలకు అలవాటు పడ్డారు. క్రమేపీ వాటికే సంప్రదాయాలనే పేర్లు పెట్టి సంకెళ్ళు తగిలించుకున్నారు. ఈ రోజుల్లో ఆడపిల్ల పుట్టిందంటేనే ఏదో పాపం చేసినంత నొచ్చుకోవటం — ఆ తర్వాత ప్రకృతి సహజంగా ఏం జరిగినా అదంతా లేనిపోని బాధగా లెక్కవేసుకోవటం - అలవాటయిపోయింది!

దీనికి పరిష్కారం లేదా? ఇలా ఎంతకాలం సాగాలి? ఆలోచించండి. ఇకనయినా అప్పుల మీద అప్పులు - ఆడంబరాలు - అనవసరం అని అర్థంచేసుకోండి. ఇంతకిన్న డబ్బు చేతికి వచ్చినప్పుడు....ఇంట్లో అందరికీ సరిపడా బట్టలు కుట్టించండి. మరేవయినా సమకూర్చండి. వాటికో అర్థం వుంది. అందం వుంటుంది.

చిన్నదాన్ని పెద్దమాటలు చెపుతున్నా ననుకోకండి!

ఇది నా ప్రజ్ఞ కాదు. జీవితం అనే పాఠశాలలో ఎంతో చదువుకున్న చిన్నవదిన పెట్టిన భిక్ష!

ఉంటాను—మీ మేనకోడలు

వసుంధర.

రాజ్యలక్ష్మి నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోతుంటే నిర్ఘాంతపోయారా తల్లిదండ్రులు! *